కాంగ్రెస్‌లో చేరిన బొట్టు రామ్



బొట్టురామ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జియాగూడ: సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి, పట్టుదలకు ఆకర్షితుడినై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు బీజేపీ బీసీ రాష్ట్ర నాయకుడు బొట్టు రామ్ తెలిపారు. గురువారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి జడ్చర్ల శాసన సభ్యుడు అనిరుద్‌రెడ్డి, దేవదకద్ర శాసన సభ్యులు మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీ చందర్‌రెడ్డి, రవీంద్రభారతి మాజీ చైర్మన్ శివకుమార్, శాసన సభ్యులు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లతో కలిసి సీఎంను సన్మానించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి బొట్టురామ్‌కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో 16 ఏళ్లుగా టీడీపీలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా, బీజేపీలో మూడేళ్లుగా బీసీ రాష్ట్ర నాయకుడిగా సేవలందించానన్నారు. సీఎం ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి, ప్రజలకు సేవ చేస్తానన్నారు.

ఈద్గాలు, జామా మసీదుల వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: రంజాన్ ప్రార్థనలు జరిగే ఈద్గాలు, జామా మసీదుల వద్ద ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఈద్గాల వద్ద ఏర్పాట్లపై గురువారం ఆయన తన కార్యాలయంలో మజ్లిస్ సీనియర్ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన ఈద్గాల వద్ద ప్రభుత్వం ఈపాటికే ఏర్పాట్లు ప్రారంభించిందన్నారు. త్వరలోనే తాను ఈద్గాల వద్ద జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తానన్నారు. ముఖ్యంగా కుతుబ్‌షాహీ ఈద్గా, పాంచ్ కమాన్ ఈద్గాల వద్ద పండుగ రోజు జరిగే ప్రార్థనలకు భారీ సంఖ్యలో ముస్లింలు వస్తారని ఆయన పేర్కొన్నారు. గోల్కొండ బంజారా దర్వాజ వద్ద గల కుతుబ్‌షాహీ ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. కార్వాన్, లంగర్‌హౌస్, నానల్‌నగర్ డివిజన్‌లలో ఈద్ ప్రార్థనలకు ఆతిథ్యం ఇచ్చే ఈద్గాల వద్ద కూడా పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

బీజేపీ విజయానికి కృషి



లడ్డులాల్ యాదవ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: అత్యధిక ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచే విధంగా కృషి చేస్తానని రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షుడు లడ్డులాల్ యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్‌కు చెందిన లడ్డులాల్ యాదవ్‌ను రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షుడిగా గురువారం పార్టీ నియమించింది. ఈ సందర్భంగా ఆయనను బీజేపీ నాయకులు రాజేందర్ సింగ్ థక్రాల్, హర్మిందర్ సింగ్ బగ్గా, కనీష్ సింగ్ బగ్గా, అమర్‌జీత్ సింగ్ థక్రాల్, చరణ్‌జీత్ సింగ్ థక్రాల్, రాజేందర్‌సింగ్ థక్రాల్, గురుద్యాల్ సింగ్, మన్మోహన్‌సింగ్ (మోనా)లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లడ్డులాల్ యాదవ్ మాట్లాడుతూ...గోషామహల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర నలుమూలలా బీజేపీని పటిష్టం చేస్తూ మోదీ పథకాలను ప్రచారం చేసి బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తానన్నారు. హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీని చిత్తుగా ఓడిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని చిత్తుగా ఓడిస్తామన్నారు.

గరికపాటి వెంకట్ సేవలు అద్వితీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రకాష్ చంద్ర బరోడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తాళ్లపాక కథ సాహిత్యానికి గరికపాటి వెంకట్ చేస్తున్న సేవలు అద్వితీయమని స్టేట్‌బ్యాంక్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ ప్రకాష్ చంద్ర బరోడ్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతి మహోత్సవాలను పురస్కరించుకుని వెంకట్ గరికపాటి వ్యాఖ్యానంతో కూడిన చినతిరుమలయ్య చిన్మయ చింతనం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాళ్లపాక పద సాహిత్యంపై గరికపాటి వ్యాఖ్యాన గ్రంథాలు తెలుగు సాహిత్యాన్నికి మణిపూసలుగా నిలుస్తాయని కొనియాడారు. అంతకు ముందు శ్రీనిధి మ్యూజిక్ అకాడమి శిష్య బృందంచే ఆలపించిన అన్నమయ్య సప్తగిరి సంకీర్తనల శత గళార్చన కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. ప్రముఖ సాహితీ వేత్త ఓలేటి పార్వతీశం, భాషా సాంస్కృతిక శాఖ సంపాదకులు మామిడి హరికృష్ణ, సాహితీ వేత్త సుధామ, సంస్థ అధ్యక్షులు చంద్రశేఖర్, సంగీత దర్శకురాలు శ్రీనిధి తిరుమల పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలాలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఎంఏ సిద్దిఖి

సుల్తాన్‌బజార్: వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ విమర్శించింది. హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తర్ హుస్సేన్‌తో కలిసి ఉమ్మడి ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్దిఖి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 77 వేల ఎకరాలు ఉన్న వక్ఫ్ భూములు చాలా వరకు కబ్జాలకు గురయ్యాయని వారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల గ్రేవియార్డ్ కోసం 125 ఎకరాల భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యం చేసుకొని వక్ఫ్‌బోర్డు భూముల నుంచి 125 ఎకరాల భూమిని గ్రేవియార్డ్ కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

● ఇఫ్తార్ విందు

గౌలిగూడలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. లయన్ రవి శంకర్ ఆధ్వర్యంలో ముస్లిం ల కోసం గౌలిగూడలోని రవి అండ్ కంపెనీ ముందు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున స్థానిక ముస్లిం లతో పాటు పరిసర ప్రాంతాల వారు విచ్చేసి ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్ రవిశంకర్ మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో షమీ, ప్రసాద్‌లతో పాటు పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు. - అబిడ్స్





ఇఫ్తార్ విందులో లయన్ రవిశంకర్ తదితరులు

పేరుకుపోతున్న చెత్తాచెదారం



కతోరా హౌజ్ వెనుక చెత్త డంపింగ్

గోల్కొండ: చారిత్రక ప్రదేశాల పరిసరాల డంపింగ్ యార్డులు మారుతున్నాయి. గోల్కొండలోని కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి కతోరా హౌజ్ చుట్టు చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. కుతుబ్‌షాహీ రాజుల హయాంలో గోల్కొండ కోటలోని రాజవంశీయులకు సుహాసనలతో కూడిన నీటిని కతోరా హౌజ్ అందించేది. అటువంటి కతోరా హౌజ్ నేడు కుళ్లిన చెత్త నుంచి దుర్గంధం స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కతోరా వెనుకవైపు గల దర్వాజా వద్ద భారీగా చెత్త కుప్పలు ఉంటున్నాయి. ఇటు బల్దియా వారు గానీ, అటూ కేంద్ర ప్రభుత్వ పురాతత్వ సర్వేక్షణ శాఖ వారు గానీ కతోరా హౌజ్ పరిరక్షణను పట్టించుకోవడం లేదు. దీంతో ఈ పరిసరాలు అంతా డంపింగ్ యార్డులుగా మారాయి. కతోరా హౌజ్ చుట్టు పటిష్టమైన కంచె ఏర్పాటు చేసి చెత్త డంపింగ్ ఆపాలని పలువురు కోరుతున్నారు.

నేడు సామూహిక ప్రార్థనలు

- రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం (జుమ్మాతుల్ విదా) నేపథ్యంలో..
- మక్కా మసీదులో భారీ ఏర్పాట్లు
- వేలాదిగా తరలిరానున్న ముస్లింలు
- ట్రాఫిక్ దారి మళ్లిస్తున్న అధికారులు



చార్మినార్: రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం సందర్భంగా నిర్వహించే జుమ్మాతుల్ విదా కోసం ప్రభుత్వం లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశారు. చివరి శుక్రవారం సామూహిక ప్రార్థన సందర్భంగా మక్కా మసీదులో అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. మక్కా మసీదు ప్రాంగణంతో పాటు చార్మినార్ గ్రానైట్ రోడ్లపై కూడా ముస్లిం ప్రజలు శుక్రవారం ఉదయం సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగించనున్నారు. ఇందులో భాగంగా చార్మినార్–మదీనా, ముర్గి చౌక్, శాలిబండ, రాజేష్ మెడికల్ తదితర రూట్లలో ట్రాఫిక్‌ను దారి మళ్లించనున్నట్లు తెలిపారు. ఏదైనా సహాయం, ప్రయాణ సహాయం కోసం పౌరులు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 90102 03626కు కాల్ చేయాలని కోరారు.

ట్రాఫిక్ దారి మళ్లింపు ఇలా..

- **మదీనా జంక్షన్:** నయాపూల్ వైపు నుంచి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్ మదీనా జంక్షన్ వద్ద సిటీ కాలేజీ వైపు మళ్లిస్తారు.
- **హిమ్మత్‌పురా:** నాగుల్చింత/శాలిబండ ప్రాంతాల నుంచి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను హిమ్మత్‌పురా జంక్షన్‌లో హరిబౌలి, వోల్గా హోటల్ టీ జంక్షన్ (ఖిల్వత్ వైపు) వైపు మళ్లిస్తారు.
- **చౌక్ మైదాన్ ఖాన్:** కోట్లా అలీజా నుంచి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్ చౌక్ మైదాన్ ఖాన్ వద్ద హఫీజ్ డంకా మాస్క్, అర్మాన్ హోటల్ వైపు మళ్లించబడుతుంది.
- **మోతీగల్లీ:** మూసాబౌలి ప్రాంతాల నుంచి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్, మోతీగల్లీ వద్ద ఖిల్వత్ గ్రౌండ్, రాజేష్ మెడికల్ హాల్ శాలిబండ, ఫతే దర్వాజా రోడ్డు వైపు మళ్లించబడుతుంది.
- **ఎతేబార్ చౌక్:** ఎతేబార్ చౌక్ ప్రాంతాల నుంచి గుల్జార్‌హౌస్ వైపు వచ్చే ట్రాఫిక్ ఎతెబార్ చౌక్ వద్ద మండి మీరాలం మార్కెట్ లేదా బీబీ బజార్ వైపు మళ్లించబడుతుంది.
- **షేర్ ఇ బాటిల్ కమాన్:** మిట్టి కా షేర్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గుల్జార్ హౌస్ వైపు అనుమతించరు. అలాగే మిట్టి-కే-షేర్ జంక్షన్ నుంచి ఘాన్సీ బజార్ వైపు మళ్లించి హైకోర్టు రోడ్డు/ఖిల్వత్‌కు చేరుకుంటారు.
- లక్కడ్ కోట పాత సీపీ ఆఫీస్ జంక్షన్ ఏబీ ఏటీ వైపు నుంచి వచ్చే ట్రాఫిక్ లక్కడ్ కోట వద్ద మళ్లించబడుతుంది.

పాతబస్తీలో పార్కింగ్ స్థలాలు..


- **గుల్జార్ ఫంక్షన్ హాల్:** మదీనా, పత్తర్‌గట్టి నుండి వచ్చే వాహనదారులు తమ వాహనాలను గుల్జార్ ఫంక్షన్ హాల్‌లో పార్క్ చేస్తారు.
- **ముఫీద్ ఉల్ అనమ్ గ్రౌండ్ పార్కింగ్:** యాకుత్‌పురా–నూర్ఖాన్ బజార్, తలాబ్ కట్టా, డబీర్‌పురా నుంచి వచ్చే వారు తమ వాహనాలను ముఫీద్ ఉల్ ఆనం గ్రౌండ్‌లో తమ వాహనాలను పార్కు చేసుకోవాలి.
- **చార్మినార్ బస్ టెర్మినల్ పార్కింగ్:** చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా ప్రాంతాల నుంచి వచ్చే వారు తమ వాహనాలను చార్మినార్ బస్ టెర్మినల్ వద్ద పార్కింగ్ చేస్తారు.
- **చార్మినార్ హాస్పిటల్ పార్కింగ్:** సంతోష్ నగర్, తలాబ్ కట్టా మొగల్‌పురా నుండి వచ్చే వారు తమ వాహనాలను హాస్పిటల్ పార్కింగ్ వద్ద పార్క్ చేస్తారు.
- **ఖిల్వత్ గ్రౌండ్ పార్కింగ్:** మిస్రిగంజ్, ఫతే దర్వాజా, హుస్సేనీ ఆలం, పురానాపూల్ వైపుల నుంచి వచ్చే వారు తమ వాహనాలను ఖిల్వత్ గ్రౌండ్‌లో పార్క్ చేస్తారు.
- **చౌమొహల్లా ప్యాలెస్:** మక్కా మసీదు పశ్చిమం వైపు నుంచి వచ్చే ట్రాఫిక్ అంటే కిషన్‌బాగ్ బహదూర్‌పురా హుస్సేనీ ఆలం పైన పేర్కొన్న పార్కింగ్ ప్రదేశాలలో వారి వాహనాలను పార్క్ చేస్తారు.
- **జీహెచ్ఎంసీ ఆఫీస్ సర్దార్ మహల్:** డ్యూటీలో ఉన్న పోలీసు అధికారుల కోసం వాహనాల పార్కింగ్.

బీజేవైఎం రాష్ట్ర కోశాధికారిగా యోగ్ రాజ్‌సింగ్



గోల్కొండ: బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి కార్వాన్ నియోజకవర్గానికి చెందిన టి.యోగ్‌రాజ్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు నుంచి నియామకపత్రాన్ని అందుకున్నారు. కార్వాన్ నియోజకవర్గంలో బీజేవైఎం బలోపేతానికి గత కొన్ని సంవత్సరాలుగా యోగ్‌రాజ్‌సింగ్ కృషి చేశారు. కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కార్వాన్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన టి.అమర్‌సింగ్ కుమారుడే యోగ్‌రాజ్‌సింగ్. అధిష్టానం ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని యోగ్‌రాజ్‌సింగ్ అన్నారు.

నియామకం



శివచంద్రగిరి

గౌలిపురా: గౌలిపురాకు చెందిన ఎ.శివచంద్రగిరి భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ తన సేవలను గుర్తించి తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల పాలన, యువతకు ఇచ్చిన హామీలపై పోరాటం చేస్తామన్నారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రావడానికి కృషి చేస్తామన్నారు.

'బ్రాండ్ లైఫ్ పీఆర్'కు ఉత్తమ పీఆర్ స్టార్టప్‌గా గుర్తింపు



అబిడ్స్: పీఆర్‌సీఐ 20వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో 'బ్రాండ్‌లైఫ్ పీఆర్'ప్రత్యేక గుర్తింపు పొందింది. గురువారం జరిగిన పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో హరిప్రసాద్ గోగికర్, సుప్రిత్ పత్తిపాటి బ్రాండ్‌లైఫ్ పీఆర్ ప్రత్యేక విభాగంలో ఉత్తమ పీఆర్ స్టార్టప్‌గా అవార్డు పొందారు. పీఆర్‌సీఐ ద్వారా పీఆర్ రంగంలో అత్యుత్తమ నిపుణులకు అవార్డులు అందజేశారు. ఈ అవార్డులు హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ షకీల్ అహ్మద్ అందజేశారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన కానిస్టేబుల్ రిమాండ్

నాంపల్లి: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన పోలీసు కానిస్టేబుల్‌ను హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. డీ–క్లాస్ క్వార్టర్స్ సమీపంలో నివాసం ఉండే డ్రైవర్ కె.శంకర్ కుమారుడు కె.గోపినాథ్ ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం పీటీసీకి అటాచ్ ఉన్నారు. అయితే స్థానిక బస్తీలో నివాసం ఉండే ఓ 16 ఏళ్ల అమ్మాయిపై అత్యాచారం చేశారు. ఈ విషయాన్ని బాధిత బాలిక తల్లిదండ్రులకు తెలుపడంతో హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో అత్యాచారానికి పాల్పడిన కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

'రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు'



కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నందు వల్లే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పలు అవినీతి కుంభకోణాలు, భూకబ్జాల వివరాలు ఒకొక్కటిగా బయటకు వస్తున్న సందర్భంగా గురువారం ఆయన కాంగ్రెస్ నాయకులతో బీఆర్ఎస్‌ను తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల అభిమానం చూరగొన్నదన్నారు. ఈ మూడు నెలల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన అవినీతి బాగోతాలు ఒకొక్కటిగా వెలుగు చూస్తున్నాయన్నారు. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో గతంలో చోటు చేసుకున్న ఫోన్ ట్యాపింగ్ దీనికి ఒక ఉదాహరణ అని ఆయన అన్నారు. ఏదేమైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణను స్వచ్ఛ రాష్ట్రంగా తీర్చిదిద్దడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు హమీద్‌ఖాన్, రాములు, నర్సింగ్ తదితరులున్నారు.

బీజేవైఎం సెంట్రల్ జిల్లా కార్యదర్శిగా దేవర వంశీ



దేవర వంశీకి నియామకపత్రం అందించి అభినందిస్తున్న గౌతమ్‌రావు

గోల్కొండ: పార్టీ ఆశయ సాధన కోసం కృషి చేస్తానని బీజేవైఎం సెంట్రల్‌జిల్లా కార్యదర్శిగా నియమితులైన దేవర వంశీ అన్నారు. ఆయనను బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు గురువారం దేవర వంశీకి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవర వంశీ మాట్లాడుతూ.. తన తండ్రి దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ అడుగుజాడల్లో నడుస్తానని పార్టీ కోసం క్రమశిక్షణతో పని చేస్తానన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ఆదేశాలను పాటిస్తూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి చర్యలు



యాకుత్‌పురా: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు వై. శ్రీనివాసచారి అన్నారు. గురువారం పురానీహవేలీలోని కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఇటీవల గెలుపొందిన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీనివాసచారి, ఉపాధ్యక్షుడిగా కే.ప్రవీణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాకా హర్షవర్ధన్, సంయుక్తా కార్యదర్శిగా బర్కా రాజేష్‌కుమార్, లైబ్రరీ కార్యదర్శిగా వి.సుధాంశు కుమార్, కోశాధికారిగా టి. విశాల్‌సింగ్, స్పోర్ట్స్, కల్చరర్ కార్యదర్శి రామిణి సైదిరెడ్డి, లేడి రిప్రేసెంటేటివ్‌గా ఎస్. జశ్వంత్‌కౌర్, కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది దీపక్ సంచేటి ప్రమాణ స్వీకరం చేయించారు. అనంతరం నూతన సభ్యులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన డాక్టర్ శివకుమార్ తదితరులు

లంగర్‌హౌస్: ప్రధాని మోదీ చేపట్టిన సంస్కరణలను ఆకర్షితులమై రాజకీయాల్లో చేరామని రెనోవా ఆస్పత్రి ఎండీ డాక్టర్ శివకుమార్, పలువురు సంఘ సేవకులు అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ సంఘ సేవకులు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, పలువురు ప్రముఖులు బుధవారం రాత్రి బీజేపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దాదాపు 50 మందికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హైదరాబాద్ పార్లమంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, మాజీ కార్పోరేటర్ ఉదయ్ కుమార్, నాగేంద్ర ప్రకాష్‌రెడ్డిలు పాల్గొనగా విశ్రాంత డిప్సీ జగ్గారావు, మదన్ సింగ్, బుచ్చిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆర్మీ ఆంజనేయులు, శ్రీమంత్‌రెడ్డిలతో పాటు 50 మంది భాజపాలో చేరారు.

పూల దుకాణంలో చోరీ

– 48 గంటల్లో ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి

అబిడ్స్: పూల దుకాణంలో దొంగతనం చేసిన వ్యక్తిని గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేసి 48 గంటల్లో కేసును ఛేదించారు. గురువారం సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు. గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లో మధుసుధన్‌రెడ్డి ఈనెల 1న దుకాణంలోని బీరువాలో డబ్బును దాచాడు. ఇది గమనించిన గజానంద్ ఎవరికి కనిపించకుండా దుకాణం వెనుక వైపు నుంచి దుకాణం వైపు ప్రవేశించి రూ.7.90 లక్షల నగదుతో పరారయ్యాడు. సీసీ కెమెరాల్లో పోలీసులు గజానంద్‌ను గుర్తించి మహారాష్ట్రలోని నాందేడ్‌కు పోలీసులు వెళ్లగా గజానంద్ ఇంట్లోనే ఉన్నాడు. అతన్ని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించడంతో రూ.7.90 లక్షల నగదును దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. గజానంద్ వద్ద నగదును స్వాధీనం చేసుకుని పోలీసులు అతడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..గుడిమల్కాపూర్ ప్రాంతంలో ప్రతిరోజూ పెద్ద ఎత్తున పూలు, కూరగాయాల వ్యాపారాలు కొనసాగుతాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

మసీదులు ముస్తాబు



ముస్తాబైన కరబ్‌బాగ్ మసీదు

గోల్కొండ: నేడు జరిగే రంజాన్ మాసపు చివరి శుక్రవారం ప్రార్థనలకు మసీదులు ముస్తాబయ్యాయి. మెహిదీపట్నం, టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని ప్రధాన మసీదులు శుక్రవారం ప్రార్థనల కోసం అందంగా ముస్తాబయ్యాయి. అహ్మద్‌నగర్‌లోని బిలాల్ మసీదు, మెహిదీపట్నంలోని ఏక్‌మినార్ మసీదుతో పాటు టోలిచౌకీ చౌరస్తా, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని మసీదులను వాటి నిర్వాహకులు ప్రార్థనలకు అవసరమైన ఏర్పాట్లు గావించారు. ఖుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి గోల్కొండ, కుతుబ్‌షాహీ మసీదులో వేలాది మంది ప్రార్థనలు చేసేందుకు గాను ఏర్పాట్లు పూర్తయ్యాయి. రంజాన్ మాసంలో చివరగా వచ్చే శుక్రవారానికి జుమతుల్‌విదా అని పిలుస్తారు. ఈరోజు మధ్యాహ్నం జరిగే శుక్రవారం ప్రార్థనలకు రంజాన్ మాసంలో ఎంతో ప్రాధాన్యత ఉంది.

కళ్ల జోళ్ల అందజేత



కళ్ల జోళ్లను అందజేస్తున్న పోలీస్ అధికారులు

లంగర్‌హౌస్: ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు డ్రైవర్లు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నగర ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు అన్నారు. ఇటీవల ఆటో, బస్సు వివిధ వాహనాల డ్రైవర్లతో గుడిమల్కాపూర్‌లో ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రోటరీ క్లబ్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో సమస్య ఎదుర్కొంటున్న 90 మందికి గురువారం ఉచితంగా కళ్ల జోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఏసీపీ ధన లక్ష్మీ, ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అబిడ్స్: అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీభవన్ మెట్రోస్టేషన్ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని అబిడ్స్ పోలీసులు స్వాధీన పరచుకున్నారు. ఎస్ఐ సుధాకర్ మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సుమారు 32–37 ఏళ్ల వయస్సు గల యాచకుడు మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతని ఆచూకి తెలిస్తే అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. 5.3 అడుగుల ఎత్తు, సన్నగా ఉన్న వ్యక్తి అని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

రక్తదాన శిబిరం



మణికొండ: ఆపదలో ఉన్న వారికి రక్తదానం వారి ప్రాణాన్ని నిలుపుతుందని, అలాంటి వారికి యువత ఎక్కువసార్లు రక్తదానం చేయాలని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి అన్నారు. గురువారం కళాశాల విద్యార్థులు ప్రతిమ సాయి బ్లడ్ బ్యాంక్ వారి కోరిక మేరకు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. రక్తదానంతో జీవితాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, హెచ్ఆర్ అమర్‌నాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.